క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి

మంగళగిరి: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన రిలేదీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. వారు మాట్లాడుతూ మాదిగల ఉన్నతి కోసం శ్రమించిన నాయకుడు మందకృష్ణ అన్నారు. వర్గీకరణ చేయకుండా ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. రాబోయే పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చందోలు విక్టర్‌పాల్, ఇందుపల్లి రామారావు, కలకోటి నాగేశ్వరరావు, అద్దేపల్లి నాగేశ్వరరావు, పులివర్తి నథానియేలు, యేసుపోగు శ్యామల, పాతకోటి భాస్కర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంలో పాము



మంగళగిరి: తన నివాసంలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనంలో పాము కనిపించడంతో ఓ యువకుడు భయాందోళనకు గురయ్యాడు. ఎంత సేపు శ్రమించినా ద్విచక్రవాహనం నుంచి పాము బయటకు రాలేదు. సేకరించిన వివరాల మేరకు.. యర్రబాలెంకు చెందిన కోసూరి వీరయ్య కేబుల్ ఆపరేటర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం సాయంత్రం ఇంట్లో పార్కింగ్ చేసిన తన స్కూటీ వాహనాన్ని బయటకు తీశాడు. ద్విచక్ర వాహనంలో పాము ఉండటాన్ని గమనించాడు. వెంటనే తన ఇంటి సమీపంలో ఉన్న ఆర్అండ్‌బీ రహదారిపైకి తీసుకువచ్చి స్థానికుల సహాయంతో పామును బయటకు తీసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. పాము మాత్రం బయటకు రాలేదు. చేసేది లేక ద్విచక్ర వాహనాన్ని ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసి మిన్నకుండిపోయారు.

ఫోన్ చోరీ...ఆపై రూ. 80వేల నగదు విత్‌డ్రా

మంగళగిరి: సెల్‌ఫోన్ చోరీ చేసి ఆపై అదే ఫోన్ నుంచి రూ.80వేల నగదును ఓ దుండగుడు విత్‌డ్రా చేసిన ఘటన చోటుచేసుకుంది. ఆదివారం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... యర్రబాలెంకు చెందిన నాయుడు వెంకట్రావు తన కుటుంబ సభ్యులతో కలసి ఈనెల 14వ తేదీన తిరుపతి వెళ్లాడు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో వెంకట్రావు, ఆయన మేనల్లుడు పాశం వెంకటేశ్వరరావుల జేబుల్లో ఉన్న రెండు సెల్‌ఫోన్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. స్వామి వారి దర్శనానికి బస్సులో బయలుదేరే సమయంలో ఇరువురు తమ ఫోన్లు మాయమైనట్లు గుర్తించారు. వెంకట్రావు వెంటనే యర్రబాలెంలోని తన సమీప బంధువుకు ఫోన్ చేసి యూనియన్ బ్యాంకుకు వెళ్లి ఖాతాలోని బ్యాలెన్స్ తనిఖీ చేయాలని కోరాడు. తన ఖాతాలో రూ.1,79,365 ఉండాల్సి ఉండగా రూ.99,365 మాత్రమే ఉండటంతో రూ.80వేలు మాయం చేశారని గుర్తించి తన ఖాతాను బ్లాక్ చేయించాలని కోరాడు. ఘటనపై వెంటనే తిరుపతి ఈస్ట్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అక్కడ అధికారులు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితుడు సైబర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా వారు ఖాతాకు సంబంధించిన బ్యాంక్ స్టేట్‌మెంట్ కాపీ కావాలని కోరారు. చేసేది లేక స్వామివారి దర్శనానంతరం తిరిగి యర్రబాలెం చేరుకున్న బాధితుడు వెంకట్రావు ఆన్‌లైన్‌లో సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆదివారం మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సీఐ మల్లికార్జునరావుకు వివరాలు తెలుపగా పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేస్తే తాము దర్యాప్తు చేస్తామని తెలిపారు.

33 శాతం రిజర్వేషన్ కేటాయించాలి

మంగళగిరి: రానున్న శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న మహిళా బిల్లులో ఓబీసీ కోటా కింద 33 శాతం రిజర్వేషన్ కేటాయించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు కాండ్రు కమల అన్నారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 25 సంవత్సరాల కిందట ప్రవేశపెట్టిన మహిళా బిల్లు ఇప్పటికీ ఆమోదానికి నోచుకోకపోవడం శోచనీయమన్నారు. భారత జనాభాలో 48 శాతం మహిళలు ఉన్నారని, చట్టసభల్లో వీరి ప్రాతినిధ్యం ఏనాడూ 15 శాతానికి మించలేదన్నారు. మహిళలు తమ మనోభావాలను, సమస్యలను తెలియజేయడానికి వేదిక చట్టసభలేనని, మహిళల పాత్ర తప్పనిసరి అన్నారు. మహిళా బిల్లు చట్టపరంగా ఆమోదం పొందితే ఎవరి సీటు ఎవరికి వస్తుందోననే భయం అన్ని రాజకీయ పార్టీలకు పట్టుకుందని, అందుకే బిల్లు రూపకల్పన చేసినా బిల్లులో లోపాలకు అవకాశం కల్పించి చట్టంగా మారకుండా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పారేపల్లి మహేష్, కాగితాల స్వాతి గౌడ్, తిరువీధుల కిరణ్, ఆలా శివాజీ, మాదు నాగదుర్గ తదితరులు పాల్గొన్నారు. వినాయ చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.

వైభవంగా మహా సుదర్శన హోమం



డ్రైఫ్రూట్స్, పిండి వంటలతో ఆంజనేయస్వామి రూపం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తెనాలిటౌన్: షరాఫ్‌బజార్‌లోని శ్రీసువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు, శ్రీ మహా సుదర్శన హోమం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయంలో తిరుమలలో జరిగే విధంగా తిరుప్పావడ సేవను నిర్వహించారు. 108 కేజీల పులిహోరను రాశిగా పోసి పండ్లు, డ్రైఫ్రూట్స్, పిండి వంటలతో ఆంజనేయస్వామి రూపంలో అలంకరణ చేశారు. ఆగమోక్తంగా అర్చన, కైంకర్యాలను నిర్వహించి స్వామికి సమర్పించారు. తొలుత శ్రీ మహా సుదర్శన స్వామి విగ్రహానికి పంచామృత స్నపన, అర్చన, సుదర్శన హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైఖానస ఆగమోక్తంగా ఆలయ వంశపారంపర్య అర్చకులు ఆర్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో జరిపారు. వైఖానాస ఆగమ పండితులు రఘురామ్, నాగమారుతీలు, రుత్విక్‌లు వైదిక క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరుప్పావడ సేవ, సుదర్శన హోమాల విశిష్టతను పండితులు వివరించారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసారెడ్డి, అర్చకులు కిరణ్‌కుమార్, సురేష్, దాతలు గుడివాడ సత్యనారాయణ, సుబ్రమణ్యం, శివప్రసాద్, బాలకృష్ణ, రామారావు, సంకీర్తన బృందం అధ్యక్షురాలు అనురాధ, సభ్యులు పాల్గొన్నారు.

తెనాలి బండ్‌పై ఆంజనేయశాస్త్రి విగ్రహ ప్రతిష్ట

విశ్వకర్మ జయంతి రథోత్సవంలో ఎమ్మెల్యే శివకుమార్



రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి/తెనాలిటౌన్: భగవంతుడు అపారమైన విద్యను, ప్రతిభను ఇచ్చిన విశ్వబ్రాహ్మణులు అదృష్టవంతులని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. వారు చేసే వస్తువులు, ఆలయ నిర్మాణాల్లో అద్భుతమైన కళాత్మకత కనిపిస్తుందని చెప్పారు. తెనాలిలో వేద పాఠశాలను ఏర్పాటుచేసి దశాబ్దాలుగా ఇక్కడ వేదవిద్యను అందించటానికి కారకులైన యలవర్తి ఆంజనేయశాస్త్రి విగ్రహాన్ని తెనాలి బండ్‌పై ప్రతిష్టిస్తామని ఆయన హామీనిచ్చారు. స్థానిక టీబీ రోడ్డులోని శ్రీ విరాట్ విశ్వకర్మ దేవస్థానంలో ఆదివారం విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. సాయంత్రం ఎమ్మెల్యే శివకుమార్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వైభవంగా చేపట్టిన రథోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. భక్తులతో కలిసి స్వయంగా రథాన్ని లాగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునికతను సంతరించుకున్న తెనాలిలో సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే సంస్థలు, వేదపాఠశాల ఉండటం గర్వకారణమన్నారు. తొలుత ఆలయంలో ఉదయం 5.30 గంటలకు స్వామివారి పతాకావిష్కరణతో విశ్వకర్మ జయంతి ఉత్సవాలను ప్రారంభించారు. 108 కలశాలతో అభిషేకం, మండపారాధన, హోమాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. యలవర్తి ఆంజేయశాస్త్రి సంస్కృత, వేద పాఠశాల చైర్మన్ నూతలపాటి సురేష్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్‌వీఎస్ మల్లేశ్వరి, అర్చకులు నారాయణ స్వామి, ఉదయ్, శంకర్, వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కళ్లజోళ్ల పంపిణీ



తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో పరీక్షల ఆధారంగా కళ్లజోళ్లు అవసరమైన 13 మందికి ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. రూరల్ మండలం అంగలకుదురులోని గణేష్ యూత్ కార్యాలయంలో ఉదయం జరిగిన రోటరీ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో కళ్లజోళ్లతోపాటు రొట్టి, పండ్లు అందజేశారు. రోటరీ క్లబ్ సేవానిరతిని గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి అభినందించారు. క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 21న ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు చెబుతూ ఆసక్తి ఉన్న ఎవరైనా పాల్గొనవచ్చని కోరారు. క్లబ్ కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, కోశాధికారి కేఎల్ జగదీశ్వరాంబ, సభ్యులు పాల్గొన్నారు.

ఏకదంతాయ ..

- వినాయక చవితి సందర్భంగా వీధులు కిటకిట
- రేటెక్కిన పత్రి, పూలు, పండ్లు
- పలుచోట్ల గణేష్ పూజామందిరాలు

తెనాలి: వినాయక చవితి పర్వదినం మరికొన్ని గంటల్లో ఉందనగా ఎటుచూసినా జనంతో వీధులు కిక్కిరిసి కనిపించాయి. పట్టణంలోని కూడలి ప్రాంతాలతో సహా ప్రధాన వీధులన్నీ వినాయకుడి ప్రతిమలు, చవితి పూజకు అవసరమైన పత్రి, ఇతర పూజాసామగ్రితో కళకళలాడుతున్నాయి. వీటి కొనుగోలు కోసం వచ్చిన జనంతో అన్నిచోట్లా రద్దీ నెలకొంది. అనేక వార్డుల్లో వినాయక చవితి పూజా పందిళ్లు పోటాపోటీగా ఏర్పాటు చేశారు. రకరకాలుగా అలంకరణలు చేపడుతున్నారు.

పట్టణ అయితానగర్, సుల్తానాబాద్ ప్రాంతాల్లోని వినాయక విగ్రహాల తయారీ కేంద్రాల్లో ఆదివారం ఉదయం నుంచే సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉత్సవ నిర్వాహకులు తమకు నచ్చిన విగ్రహాన్ని ఎంచుకుని తీసుకువెళుతూ కనిపించారు. కరోనా రెండేళ్ల కాలం చవితి ఉత్సవాలు ఆంక్షలతో జరుపుకున్న పరిస్థితి తెలిసిందే. గతేడాది పూర్తి స్వేచ్ఛతో జరుపుకున్నారు. ఈసారి అంతకు మించిన సంబరాలు జరిగేలా ఉత్సవ వాతావరణం ఉంది. అందుకోసమే ముందునుంచీ భారీ గణపతి విగ్రహాల కోసం తయారీదార్లకు ఆర్డర్లు ఇచ్చారు. మరికొందరు అప్పటికప్పుడు ఆయా కేంద్రాలకు వెళ్లి ఉన్నవాటిల్లో తమకు నచ్చినవి తెచ్చుకున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి గణపతి విగ్రహాల ధరలు హెచ్చుగా ఉన్నాయని ఉత్సవ నిర్వాహకులు చెప్పారు. మూడు అడుగుల నుంచి తొమ్మిది అడుగుల విగ్రహాల వరకు విక్రయిస్తున్నారు. సైజు ప్రకారం రూ.6 వేల నుంచి రూ.25 వేల వరకు విగ్రహాల ధరలు పలుకుతున్నాయి. మరికొందరు ఇతర నగరాల నుంచి విభిన్నంగా ఉండే వినాయకుడి విగ్రహాలను తెప్పించారు. ఇందుకోసం రూ.40 వేల వరకు వ్యయం చేశారు. కాలుష్య రహితంగా ఉండేలా మట్టి వినాయక ప్రతిమలనే వినియోగించమని అధికారులు ఎంతగా చెప్పినా, ఉత్సవ నిర్వాహకులు పెద్దగా పట్టించుకున్నట్టు లేదు.

ఇకపోతే ఇళ్లలో గణపతి పూజకు కావాల్సిన చిన్న వినాయక ప్రతిమలు రకరకాల సైజుల్లో ప్రధాన వీధుల్లో కొలువుదీరాయి. వీటిల్లో మట్టి విగ్రహాలే కాకుండా, వివిధ రంగుల్లోనూ ముస్తాబై ఉన్నాయి. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఉండటంతో సాయంత్రం చల్లబడ్డాక జనం పూజా సామగ్రి కోసం రావటం మొదలైంది. అన్ని రోడ్లు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. గతంలో రూ.30 లకు విక్రయించిన పత్రిని ఈసారి రూ.100 చెబుతున్నారు. పూల ధరలు ఆకాశాన్నంటాయి. వినాయక ప్రతిమలు ధరలు కొండెక్కాయి. రేటు విని నిట్టూరుస్తున్నా, తప్పదంటూ జనం పూజాసామగ్రిని కొనుగోలు చేశారు.

ముస్తాబైన భారీ గణపతి...

వినాయక చవితి వేడుకకు తెనాలిలోని భారీ గణపతిని ముస్తాబు చేశారు. తెనాలి విజయవాడ రోడ్డులో ఊరి పొలిమేరలో 59.5 అడుగుల భారీ వినాయక విగ్రహం వార్షిక చవితి వేడుకలకు సిద్ధం చేశారు. పట్టణానికి చెందిన స్నేహితులు కోటా శ్రీనివాస్, అమిరినేని రాజా, కొణిజేటి గోపీకృష్ణ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. 1997లో శ్రీ త్రిదండి రామానుజ చినజీయరుస్వామి ఆవిష్కరించారు. ఏటా వినాయకచవితికి మూడురోజులపాటు ఉత్సవాలను జరుపుతూ వస్తున్నారు.



పట్టణంలో వినాయక చవితి సందడి

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



వినాయక ప్రతిమల పంపిణీ



విగ్రహాల పంపిణీ

తెనాలి: పట్టణ బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజి, ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు రూరల్ మండలం పెదరావూరులో ఆదివారం శత వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. మట్టి గణపతిని పూజిద్దాం...ప్రకృతిని కాపాడుదాం అనే నినాదంతో మట్టి వినాయక ప్రతిమలను గ్రామస్థులకు అందజేశారు. వినాయక చవితి పర్వదినానికి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ బొమ్మలను వినియోగిస్తే, ప్రకృతి కలుషితం అవుతుందని హెచ్చరించారు. కచ్చితంగా మట్టితో తయారుచేసిన విగ్రహాలను ఉపయోగించి పర్యావరణానికి తోడ్పడాలని కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.కళ్యాణ చక్రవర్తి, యూనిట్ వలంటీర్లు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో..

తెనాలి: రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఇక్కడి కమిషన్ కొట్ల బజారులో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణ హితంగా వినాయక చవితిని జరుపుకునేలా పౌరులను ప్రోత్సహించేందుకు, తమ సంస్థ కార్యకర్తలు కేకేసీ, వంశీ, ఏకేజీ సహకారంతో 1500 ప్రతిమలను పంపిణీ చేసినట్టు రెడ్‌క్రాస్, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి వెల్లడించారు. కార్యవర్గసభ్యులు డాక్టర్ పావనీ ప్రియాంక, కుర్రా శ్రీను, కొణిజేటి మురళి, సరిత, కొణిజేటి రామారావు, గణేష్, విధాత్రి, ప్రియాకరేష్మ, కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ..

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఇక్కడి శివాజీ చౌక్‌లో మట్టితో చేసిన వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. చైతన్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి చేతుల మీదుగా వీటిని అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, మువ్వా సత్యనారాయణ, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

ఆలయాన్ని శుభ్రం చేసిన యోగమండలి సభ్యులు



వినాయక విగ్రహం వద్ద కిషోర్ గురూజీ, సభ్యులు

తెనాలిటౌన్: తెనాలి-విజయవాడలోని వీఎస్సార్ కాలేజ్ ఎదురుగా ఉన్న విఘ్నేశ్వర దేవాలయాన్ని వినాయక చవితి పండుగ సందర్భంగా ఆదివారం ఉదయం శ్రీ ఆంజనేయ ధ్యాన యోగ మండలి సభ్యులు శుభ్రం చేశారు. ఆలయంలో ఉన్న బూజును దులిపి ఆలయాన్ని కడిగారు. ఆలయం ఎదుట రంగవల్లులతో అలంకరణ చేశారు. అక్కడ ఉన్న భారీ వినాయక విగ్రహాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ, సభ్యులు పాల్గొన్నారు.

అసోసియేషన్ అధ్యక్షుడిగా కరిముల్లా



తెనాలిఅర్బన్: ఏపీ ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూయూఎస్ డిపార్ట్‌మెంట్స్ మెయింటెనెన్స్ అండ్ ప్రాజెక్టు ఎస్టాబ్లిష్‌మెంట్ అసోసియేసన్ తెనాలిశాఖ అధ్యక్షునిగా షేక్ కరిముల్లా, ఉపాధ్యక్షులుగా ఎం.శ్రీనివాసరావు, ఎం.చిన్నాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. ఇరిగేషన్ కార్యాలయం సమీపంలో ఆదివారం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా షేక్ అజిబుల్లా, సంయుక్త కార్యదర్శులు కె.రంగారావు, కె.ప్రసన్న, పి.రాజశేఖర్‌లను ఎన్నుకున్నట్లు చెప్పారు. వీరికి సభ్యులు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.

పురోగమిస్తున్న కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ



మాట్లాడుతున్న దావులూరి లక్ష్మీకాంతారావు

తెనాలి: పట్టణ కొత్తపేటలోని కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ 23వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం ఎన్జీవో కళ్యాణమండపంలో నిర్వహించారు. సొసైటీ చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు అధ్యక్షత వహించారు. సొసైటీ డైరెక్టర్/ న్యాయవాది వెలినేని రాఘవయ్య, మోహన్ అండ్ కో చార్టర్డ్ అకౌంటెంట్స్ డి.రాజేష్, డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు. చైర్మన్ తరపున వార్షిక నివేదికను వైస్‌చైర్మన్ చంద్రమౌళి, వార్షిక లావాదేవీలను సీఈవో కె.ఝాన్సీ సమావేశంలో నివేదించారు. 2001లో దావులూరి సోమశేఖరరావు స్థాపించిన కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రస్థానాన్ని ప్రస్తుత చైర్మన్ లక్ష్మీకాంతారావు వివరించారు. సంస్థ పాలకవర్గ డైరెక్టర్లు, సభ్యుల సహకారంతో సొసైటీ పురోగమిస్తోందని చెప్పారు. తొలుత తెనాలిలో హెడ్డాఫీసు, అంగలకుదురులో బ్రాంచితో ఏర్పాటైన సొసైటీ ప్రస్తుతం తొమ్మిది బ్రాంచిలుగా నడుస్తోందని గుర్తుచేశారు. అన్ని బ్రాంచిలు లాభాలబాటలో పయనిస్తున్నాయని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సొసైటీ రూ.2.50 కోట్ల నికర లాభాన్ని ఆర్జించిందని వివరించారు. తొలుత వ్యవస్థాపకుడు సోమశేఖరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. అంతకుముందు శ్రీవెంకట లక్ష్మీదుర్గా నాట్యమండలి, తెనాలి వారిచే 'దేవనర్తకి' పద్యనాటకంలోని కొన్ని సన్నివేశాలను ప్రదర్శించారు. ఆరాధ్యుల కోటేశ్వరరావు, కడపకు చెందిన నటి రత్నశ్రీలు నటించారు.

ఎంప్లాయిూస్ యూనియన్‌కు గుర్తింపు ఇచ్చిన సీఎం జగన్



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కృష్ణారావు

తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయిూస్ యూనియన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అతిపెద్ద యూనియన్‌గా గుర్తింపు ఇవ్వడం శుభపరిణామమని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీ కృష్ణారావు పేర్కొన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ సమావేశాన్ని ఆర్టీసీ డిపో ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థకు గుర్తింపు ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎండీ ద్వారకా తిరుమలరావు, ఏపీజేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. ఉద్యోగుల సమస్యల కోసం పోరాటాలు చేస్తునే ఉంటామన్నారు. అనంతరం ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోనల్ వైస్ ప్రెసిడెంట్ పి.యలమంద, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.రాజేష్ ఖన్నా, రీజనల్ కార్యదర్శి ఇ.విజయ్‌కుమార్, డిపో అధ్యక్ష కార్యదర్శులు ఎం.మనోజ్‌కుమార్, కె.బాబు, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శి బి.శ్రీనివాసరావు, వి.జోషబాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



తోకల అంజమ్మ (ఫైల్)

మంగళగిరి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ మహిళ మృతి చెందింది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... యర్రబాలెం ఎస్టీ కాలనీకి చెందిన తోకల అంజమ్మ (50) పూలు విక్రయించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. ఆమె భర్త రోశయ్య పంచాయతీ పారిశుద్ధ్య కార్మికునిగా పనిచేసే సమయంలో కంటి జబ్బుకు గురై చూపు కోల్పోయి ఇంటి వద్దనే ఉంటున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నేపథ్యంలో అంజమ్మ ఈనెల ఐదో తేదీన యర్రబాలెం స్పెన్సర్ సెంటర్‌లో పూలు విక్రయించుకుని ఇంటికి వచ్చే క్రమంలో రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అంజమ్మ తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఆమెను హుటాహుటీన ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. 12 రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించారు. మూడు రోజుల కిందట అంజమ్మను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు

ఒకరి మృతి–ఇద్దరికి స్వల్పగాయాలు



మృతిచెందిన విష్ణువర్ధన్

ఫిరంగిపురం: కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని బేతపూడి గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పానుగుపాడు గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ కుటుంబసభ్యుల నిమిత్తం ఖాజావలి కారులో బేతపూడి గ్రామానికి వెళ్లారు. అక్కడి నుంచి నరసరావుపేట రోడ్డుకు వస్తుండగా మార్గంమధ్యలో బేతపూడి మలుపు వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. విష్ణువర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులోని ఖాజావలి, డి.శ్రావణికి స్వల్పగాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం జీజీహెచ్‌కి తరలించారు. మృతదేహాన్ని నరసరావుపేటకు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా కిషోర్ తెలిపారు.